## వంటింటి లెక్చర్లు (7)

# మా వారి స్వీట్ డ్రీమ్సు

నిద్దట్లో మా వారికొచ్చే డ్రీమ్ సీరియల్నవల్లా చదవాలనుంటుంది నాకు. మరొకరికి వచ్చే కలల్ని చూడ్డానికి పర్మిషనుంటే మనుషులు సినిమాలెందుకు చూస్తారు. మనవాళ్ళు ఇన్ని కనిపెట్టారుగాని స్త్రీపురుషులు ఇద్దరూ కలిసి జంటకవుల్లాగ అంటుకుపోయి ఇద్దరికీ వచ్చే డ్రీమ్సుని చూసే "బైనాక్యులర్స్" ఇంకా కనిపెట్టలేదు. ఎందుకండీ వెధవ సైన్సు. (మన కొచ్చేవల్ని ఫొటోతీసే యంత్రాలు లేకపోయాక ఎవడి డ్రీము వారికే ఏకపత్నీ వ్రతంలాగ ఏకిభర్తృకల్లాగ-నాన్ సెన్స్) నా కెప్పుడూ పిండి రుబ్బుతున్నట్లు, ఒడియాలు పెడుతున్నట్లు, బట్టలుతుకుతున్నట్లు, విస్తళ్ళేత్తుతున్నట్లు కలలొస్తాయి. అప్పుడప్పుడు ఇళ్ళు మారుతున్నట్లు, గోడలకీ సున్నాలు వేయిస్తున్నట్లు మిరపకాయలు డాబామీద ఎండపోసి నట్లు కూడా వస్తాయి కలలు. ఒక రోజు అలాటికలే ఏదో ఒకటి కంటూ ఒత్తిగిలి పడుకున్నాను. నిద్దట్లో ఎవరో నా జుట్టుపట్టుకు పీకుతున్నట్ల యింది. ఇంకెవరూ—మా ఇంటి మహరాజే- మూలుగుతున్నారు. జుట్టు విడిపించుకుని "మూలక్కండి. అటు తిరిగి పడుకోండి" అని చేత్తో నెట్టాను. ఒక దిండు మీదే ఇద్దరు తలకాయలు పెట్టుగుంటే కొబ్బరినూని జిడ్డంతా కొంత దిండుకి కొంత మొహాలకీ పట్టుకుంటుంది. మా వారికి మొహంవంతా దుప్పటి లాక్కుని కప్పుకోవడం అలవాటు. చెప్పొద్దూ—

నాకు ముక్కు మాత్రం బయటకుండాలి. ఆయన రోహిణీకార్తిలో కూడా గదిలో ఉతకుత లాడిపోతున్నా ఫాన్ లేకుండా నిద్రపోతారు. అస్స లాయన నిద్రపోతూనె భోజనానికి కొస్తారు. భోంచేసెయ్యడం చేసెయ్య డం మంచం నడువెక్కి నేను వక్కపొడి తెచ్చి యిచ్చే లోపున చిన్న పిల్లాడిలా పడకేస్తారు. నేను రేడియో నోరు మూతపడేదాకా మేలుకొని ఆవీయివీ సవరిస్తూనో, సీరియల్సు చదువుతోనో పొద్దున్నకి ఇడ్లీలకు పప్పు రుబ్బుకుంటూనో కాలక్షేపం చేస్తాను. మా హీరోగారు ఫస్ట్ షో



సినిమాకి కెళ్తే నే నిద్ర చెడిపోతుందని విసుక్కుంటారు. ఆయన పరున్న గదిలో లైటువేసి చదువుకుంటే "రాస్కెల్సు. ఇడియట్స్"ని దండకం వల్లిస్తారు. నాకోపట్టాన నిద్రరాదు. అంచేత నా కంటె మా వారి, ఎక్కువకలలొస్తాయి. నేను కాస్సేపు వంటింట్లో కాస్సేపు పిల్లల దగ్గరకి చాపమీద ఎక్కడబడితే అక్కడ నడుం వాలుస్తాను. వేసవికాలం తలుపు తీసి గుమ్మంమీద తలెట్టుకుని పడుకుంటానని మా వారి కోపం.

9)

కమింగ్ టు ది పాయింట్— నా జుట్టుపీకుతున్నారని చెప్పాను కదా—లేచి మంచినీళ్ళు తాగమన్నాను.

"నువ్వే తాగు. షటప్" అన్నారు. జుట్టుపీకుతుంటే షటప్పేమి టండీ" అన్నాను అపెల్ యువర్ గ్రాండ్‌ఫాదర్, నీ జుట్టు నేను పీక లేద"న్నారు.

"ఇహ మొండివాళ్ళతో వాదనేమిటి?అని వూరుకున్నాను. ముక్కు బియటకుపెట్టి దుప్పటి మొహం మీదకు లాక్కున్నాను.

కొంచెంసేపు పోయాక "నైటుమేరొచ్చింది. భయం వేస్తోంది" అంటూ మంచినీళ్ళు తాగి లైటువేసుకుని ఓక చెత్తనవల చదువుతూ కూర్చున్నారు. "మీకు బొత్తిగా మ్యానర్సులేవు. నేను నిద్రపోతూంటె లైటు వేస్తారేమిటి? అది హింసకాదా?" అని కళ్ళు చిట్లిస్తూ ఆడిగాను.

"మేనర్సు పరాయివాళ్ళ దగ్గర చూపెట్టడానికి. సొంత మనుషుల దగ్గర మేనర్సు ఎందుకు" అన్నారు.

"మూర్ఖులకి మనం చెప్పలేం" అన్నా.

"ఎవరు మూర్ఖులు ?" అన్నారు దిండుకి జార్లబడినట్టు జార్ల పడుతూ "బాగుంది వరస?" "చదువుకోటం అంటే ఇదే కాబోలు—"

"నోర్మూయ్"

"మూస్తాను, మూస్తాను"

"చేపలా గింజుకుంటా వెందుకు?"

"భయం వేస్తోందన్నారే ఇందాక —"

"ఇందాక కలొచ్చింది. డామిట్...."

"ఏవిటా కల!"

"లేచి కూర్చో ...."

"నేను లేవలేను సుమండీ. నడుం లాగుతోంది. మీకేం?"

"కల చెప్పారు. మావారి కెప్పుడూ నీళ్ళలో మునిగిపోతున్నట్టూ,

గాలిలో ఎగురుతూన్నట్లూ, ఎగిరెగిరి దిబ్బుమని కిందపడ్డట్లు. ఇంటద్దెకోసం ఇంటివాడొచ్చినట్లూ వాడితో ఇంగ్లీషులో పోట్లాడినట్టు కలలొస్తాయి. మనకి తెలుగు కలలే సరిగ్గా వచ్చి ఏడవ్వు, మగాళ్ళకి ఇంగ్లీషు పిక్చర్ల లాగ ఇంగ్లీషులో హిందీలో కూడా కలలొస్తాయి కామోసు.

"ఇందాక జుట్టు పీకినప్పుడు ఏం కలొచ్చింది చెప్పండి అన్నా."

"ఓహో అదా—నాకు పెళ్ళయినట్టు కలొచ్చిందే—" అన్నారు.

"మనకేనా?"

"కాదు నాకే—"

"పిల్లెవరు ?"

"నువ్వుకాదు. ఎవరో—బానేవుందిలే —"

"చెప్పకండి నా కసహ్యం"

"నిద్దట్లో కూడా ఏకపత్నీ వ్రతమే ఏడవమంటావా ?" అన్నారు విసుగ్గా.

"మరి నా జుట్టు ఎందుకు పీకారు ?"

"ఆ పెళ్ళికూతురి తలలో మల్లెపూలు పెడదామని వంగాను."

"అదా? అదెవత్తె-దానికి మల్లెపూలు పెడుతూ నా జుట్టుపట్టుకుని గుంజారన్నమాట. మరి ఆ మూలుగు ఏవిటి?"

"అది నా గుండెలమీద వ్రాలి నిద్రపోయింది· ఆ బరువుకి మూలిగానేమో...."

"ఛీ! ఛీ! మీ కన్నీ ఇలాటి పాడుడ్రీమ్స్, గుండెలమీద చేతులేసుకుని పడుకునుంటారు. నన్నేడిపిద్దావని యిలా చెబుతున్నారు."

"ఒట్టు"

"ఎవరిమీద?"

"దానిమీదే-నిద్దట్లో నన్నొచ్చి పెళ్ళాడిందే ఆ నా సుందరి ...."

"ఛీ! ఛీ! అది సుందరేవిటండీ! నాకగ్నిపిస్తే ముక్కు చెవులూ కోసేసేదాన్ని."

"అందుకేనే వెర్రిదానా-నేను మళ్ళీ నిద్దరపోకుండా మేలుకూర్చుంది. అది మళ్ళీ పడుకుంటే మళ్ళీ నా కల్లోకొచ్చి నీ మొదటి పెళ్ళాం నగలూ చీరలూ యిమ్మని అడిగితే కొంప గుండపై పోదూ ?"

"అవునండీ ! మంచిపని చేశారు. నేను వెళ్ళి చాపమీద పడుకుంటా-"

"ఒద్దు. నే చెప్పినమాట విను. నన్ను ఒంటరిగా వదిలేస్తే అదొచ్చి నన్ను కామినీ పిశాచంలా పట్టుకుని గుండెలమీదెక్కి కూర్చుంటుంది."

"మీకేం భయంలేదు. బోర్లాపడుకోండి, అదొస్తే దాన్సంగతి నేను చూసుగుంటాను."

"అంతేనంటావా?"

"అంతే-అంతే-"

"మరి స్వీట్స్ డ్రీమ్సు రావుకదా!"

"రావు–రావు–నేనుండగా మీకు స్వీట్ డ్రీమ్స్ ఎల్లా వస్తాయండీ?"